


చెరకు క్రషింగ్‌పై జెసి సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో చెరకు క్రషింగ్ కార్యకలాపాల పురోగతిని జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్ సోమవారం సమీక్షించారు. చెరకు రవాణా, క్రషింగ్, రైతులకు చెల్లింపులు, మిల్లుల పనితీరుపై అధికారులు వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్వరలోనే క్షేత్రస్థాయిలో సమావేశం నిర్వహించి రైతుల సమస్యలు, షుగర్ ఫ్యాక్టరీల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన చెరకు ధరను ప్రజాప్రతినిధుల సమక్షంలో అధికారికంగా ప్రకటించనున్నట్లు చెప్పారు. జిల్లాలో చెరకు సాగు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. చెరకు సాగు విస్తరణకు వ్యవసాయ శాఖ అధికారులు, తహశీల్దార్లు కృషి చేయాలని ఆదేశించారు. దీంతో షుగర్ ఫ్యాక్టరీల మిల్లింగ్ సామర్థ్యం సక్రమంగా వినియోగించుకునే అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. సమావేశంలో కేన్ కమిషనర్ ఎం.సత్యనారాయణ, సంకిలి షుగర్ ఫ్యాక్టరీ యూనిట్ హెడ్ వెంకట సూర్య, కేన్ హెడ్ కమల్ పట్నాయక్, చీపురుపల్లి ఆర్‌డిఒ సత్యవేణి, జిల్లా వ్యవసాయ అధికారి విటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న రైతులు

పేనాలు పోయినా భూములివ్వం

పేనాలు పోయినా భూములిచ్చేది లేదు... వందల ఉద్యోగాలను ఆశగా చూపి, వేల మంది జీవనోపాధి దెబ్బతీస్తారా..? ఊరుకునేదే లేదు.. అంటూ గుర్ల మండలంలో తలపెట్టిన సూపర్‌స్మెల్టర్స్ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులు ముక్త కంఠంతో నినదించారు. ప్రత్యేకంగా రెండు బస్సులు, 20 ఆటోలు, బైకులు, కార్లతో ఉదయం 10.30 గంటలకే కలెక్టరేట్‌కు చేరుకున్న వేలాది మంది నిర్వాసితులు అవుట్ గేట్ వద్ద బైఠాయించారు. తమ వెంట తెచ్చుకున్న భోజనాలు కూడా అక్కడే చేశారు. 'మా ఊరు... మా భూమి... మా హక్కు..' అంటూ పెద్దపెట్టున చేసిన నినాదాలతో కలెక్టరేట్ ప్రాంతం దద్దరిల్లింది. రైతులు, వ్యవసాయ కార్మికులతోపాటు యువతీ, యువకులు కూడా అధిక సంఖ్యలో పాల్గొని స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుతో తమ జీవితాలతో ఆటలాడుకోవద్దంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు.

- బస్సులు, ఆటోలు, కార్లలో తరలివచ్చిన స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులు
- మా ఊరు - మా భూమి అనే నినాదాలతో దద్దరిల్లిన కలెక్టరేట్
- భోజనాలూ అక్కడే.. ● రాస్తారోకోతో స్తంభించిన ట్రాఫిక్
- భారీగా మోహరించిన పోలీసులు



'ఉద్యోగాలు వద్దు.. ఉన్న ఊరే ముద్దు' అంటూ ప్లకార్డును ప్రదర్శిస్తున్న విద్యార్థిని

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/కోట

గుర్ల మండలంలోని కెల్ల, బెల్లానపేట, దమరసింగి, మన్యపురిపేట, ఎస్ఎస్ఆర్ పేట, వల్లాపురం పంట భూముల్లో సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్ ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు 1085 ఎకరాలు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ఆ ప్రాంతాన్ని ఇటీవల ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం నాయకులు సందర్శించారు. స్టీల్‌ప్లాంట్ వల్ల వచ్చే లాభనష్టాలపై చర్చించారు. ఆ కంపెనీ ప్రకటించిన ఉద్యోగాల కన్నా నష్టపోతున్న భూమి, వాటిపై ఆధారపడిన కుటుంబాలే ఎక్కువగా భావించిన నిర్వాసిత రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, ముఖ్యంగా చదువుకున్న యువత ఆందోళనబాట పట్టారు. మా ఊరు... మా భూమి... మాహక్కు అంటూ బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఆయా గ్రామాల నుంచి చీమలదండుగా కదిలిన నిర్వాసితులు కలెక్టరేట్ వద్దకు వేలాదిగా చేరుకున్నారు. అవుట్ గేటు వద్ద బైఠాయించారు. 'పంట చేలల్లో ప్లాంట్ వద్దు, భూమి ఇవ్వకు... భవిష్యత్తు చంపకు, పరిశ్రమలు పెట్టొద్దు... ఆరోగ్యంతో ఆడుకోవద్దు, ఉద్యోగాలు వద్దు... ఉన్న ఊరే ముద్దు, పరిశ్రమల కన్నా పరిసరాలే మిన్న, చేయి చేయి కలుపుదాం... స్టీల్‌ప్లాంట్ ఆపుదాం... అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ నినాదాలతో కలెక్టరేట్ ప్రాంతం హోరెత్తిపోయింది. ధర్నానుద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడారు. కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పాలంటూ భీష్మించుకు కూర్చోవడంతో డిఆర్‌ఒ ఇ.మురళి ధర్నా వద్దకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యను కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అప్పటి వరకు భూములు సర్వే చేయబోమని హామీ ఇచ్చారు. దీనికి ముందు కొద్దిసేపు కలెక్టరేట్ జంక్షన్‌లో నిర్వాసితులు రాస్తారోకో కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు.



మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

బూటకపు భూసేకరణ సేకరణ విరమించుకోవాలి : సిపిఎం

జిల్లాలో బలవంతపు భూసేకరణ ప్రభుత్వం విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ధర్నాలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొన్ని దశాబ్దాలుగా బలవంతపు, బూటకపు భూసేకరణలే జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. భూమి తీసుకున్న ఒక్కచోట కూడా పరిశ్రమలు ఏర్పాటు చేయకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం గుర్ల మండలంలో తలపెట్టిన స్టీల్‌ప్లాంట్‌లో 700 మంది ఉద్యోగాలు వస్తాయని సంబంధిత కంపెనీ చెప్తోందని, ఈ పేరుతో భూములు లాగేసుకుంటే 5వేల మంది జీవనోపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్లే ఆ ప్రాంతంలోని రైతులు, వ్యవసాయ కార్మికులు, యువతీ, యువకులు వ్యతిరేకిస్తున్నారని వివరించారు. కంపెనీలు పెట్టడానికి పచ్చటి పంటపొలాలే ప్రభుత్వానికి దొరికాయా? అని ప్రశ్నించారు. ఇటువంటి ప్రజావ్యతిరేక చర్యలు మానుకోకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. నిర్వాసితులకు సిపిఎం అండగా నిలబడుతుందని భరోసానిచ్చారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న వ్యకాస రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు

వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కెవివి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ప్రయివేటు సంస్థలకు అప్పనంగా కట్టబెట్టేందుకే ప్రభుత్వం బలవంతపు భూసేకరణకు ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. కనీసం గ్రామసభలు కూడా పెట్టకుండా సర్వేలు చేస్తుండడం అన్యాయమన్నారు.

కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాస్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు మాట్లాడారు. గుర్ల ఎంపిపి ప్రతినిధి పొట్నూరు సన్యాసినాయుడు, జనసేన చీపురుపల్లి మండల అధ్యక్షులు వి.శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, పాలరైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొంప కృష్ణ, దమరసింగి సర్పంచ్ మీసాల ప్రసాద్, సిఐటియు నాయకులు అంబల్ల గౌరు నాయుడు, గిరిజన సంఘం నాయకులు అప్పలరాజు, నిర్వాసిత గ్రామాలకు చెందిన నాయకులు శీర అప్పలనాయుడు, బెల్లాన బంగారునాయుడు, కెల్ల భీమారావు, మందపాటి రామకృష్ణరాజు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎగ్‌బాకుతోంది

- కొండెక్కిన కోడి గుడ్డు ధర
- నెల రోజుల్లోనే పెరుగుదల
- రిటైల్ మార్కెట్లో రూ.7.50



ప్రజాశక్తి-విజయనగరంకోట

ఓవైపు కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. ఏది పట్టుకున్నా కిలో రూ.60ని టచ్ చేస్తోంది. రూ.500 నోటు బయటకు తీస్తే చేతిసంచి కూడా నిండడం లేదు. ఏదో ప్రత్యామ్నాయంగా ఉంది కదా! అని కోడిగుడ్డు వైపు చూద్దామన్నా అది కూడా 'టచ్‌మీ నాట్' అంటోంది. ఎస్.. తెలుగు రాష్ట్రాల్లో కోడిగుడ్డు కొండెక్కి కూర్చుంది. చవకైన పౌష్టికాహారం కదా అని నాలుగు గుడ్లు తెచ్చుకుని ఉడకేసుకుందామంటే మధ్యతరగతి కుటుంబాలకు అదీ కూడా అందను పొమ్మంటోంది. కోడిగుడ్డు ధర రూ.7.50 పలికి సరికొత్త రికార్డు సృష్టించడమే అందుకు కారణం.

గుడ్డు.. వెరీ గుడ్ ఫుడ్‌గా చెబుతుంటారు. పోషకాలు కావాలంటే అందరూ చూసేది గుడ్డు వైపే. అందుకే ఎన్నో పోషకాలుండే గుడ్డు రోజుకొకటి తింటే చాలని వైద్యులు చెబుతుంటారు. అలాంటి కోడిగుడ్డు ధర కొండెక్కింది. రోజురోజుకూ కొత్త రికార్డులు సృష్టిస్తోంది. గత నెల రోజులుగా గుడ్డు ధర పెరగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా రిటైల్ మార్కెట్లో గుడ్డు ధర రూ.7.50 దాటేసింది. రోజుకు ఐదో, పదో పైసలు చొప్పున పెరుగుతూ పోతోంది. సోమవారం ధరలను చూస్తే వంద గుడ్లకు రూ.700 పలుకుతోంది. దీంతో జిల్లా వ్యాప్తంగా బహిరంగ మార్కెట్లో, కిరాణా దుకాణాల్లో గుడ్డును రూ.7.50కు అమ్మాల్సి వస్తోంది. ప్రతి సంవత్సరం మాదిరిగానే కార్తీక మాసంలో గుడ్డు వినియోగం తక్కువగా ఉన్నప్పటికీ ధర పెరగడం పరిపాటిగా మారిందని చెప్పొచ్చు. గుడ్ల ఉత్పత్తి తక్కువగా ఉండటం, ఎగుమతులు పెరగడంతో మంచి ధర పలుకుతుందని కోళ్లఫాం రైతులు, హోల్‌సేల్ దుకాణాదారులు చెబుతున్నారు. కొనుగోలు చేసి తినే ప్రజలు మాత్రం వామ్మో గుడ్డు ఏడున్నర రూపాయలా? అని నోళ్లు వెళ్లబెడుతున్నారు.

బాడీ బిల్డింగ్‌లో సూర్యనారాయణకు గోల్డ్‌మెడల్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఇటీవల ముంబయిలో జరిగిన జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలో వీల్‌చైర్ (వికలాంగుల) విభాగంలో ఈదుబిల్లి సూర్యనారాయణ బంగారు పతకం సాధించాడు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. సోమవారం ఎస్‌పి ఎఆర్ దామోదర్‌ను పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్‌తోపాటు సూర్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. సూర్యనారాయణను ఎస్‌పి అభినందించి, శాలువా కప్పి సత్కరించారు.



సూర్యనారాయణను అభినందిస్తున్న ఎస్‌పి దామోదర్

సాఫ్ట్‌బాల్ విజేత విజయనగరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గుంటూరు జిల్లా మోదుకూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-19 సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. బాలుర విభాగంలో ప్రథమ స్థానం, బాలికల విభాగంలో తృతీయ స్థానంలో జిల్లా జట్లు నిలిచాయి.

దీంతో క్రీడాకారులతోపాటు కోచ్ చొక్కాపు సత్యనారాయణ, మేనేజర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యం నాయుడు, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి అభినందించారు.

ఎస్‌పి గ్రీవెన్స్‌కు 40 ఫిర్యాదులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్‌పి ఎఆర్ దామోదర్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 40 ఫిర్యాదులు అందాయి. ఇందులో భూతగాదాలకు సంబంధించి 20 ఫిర్యాదులు అందడం గమనార్హం. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఎస్‌పి ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, డిసిఆర్‌బి సిఐ కె.కుమార స్వామి, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, అంబేద్కర్, ఎస్ఐ ప్రభావతి పాల్గొన్నారు.

ఆట రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అమర్‌నాథ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



అమర్‌నాథ్

ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఆట) రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా మువ్వల అమర్‌నాథ్ ఎన్నికయ్యారు. గతంలో విజయనగరం జిల్లా అధ్యక్షులుగా, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఆయన పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా, రాజ్యాంగపరంగా రావలసిన హక్కుల కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

పదో తేదీ నుంచి టెట్

హాజరుకానున్న 13,985 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు టెట్ (టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి మురళి తెలిపారు. జిల్లాలో 5 కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షకు సుమారు 13,985 మంది హాజరు కానున్నారని తెలిపారు. సోమవారం టెట్‌పై సంబంధిత అధికారులతో ఆయన సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. టెట్ పరీక్ష ప్రతిరోజూ రెండు సెషన్లలో నిర్వహిస్తున్నట్లు డిఆర్‌ఒ చెప్పారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని, పోలీస్ బందోబస్తు నిర్వహించాలని సూచించారు. అభ్యర్థుల కోసం ఆర్‌టిసి సరిపడే బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పక్కాగా ఏర్పాట్లు చేసి, టెట్ పరీక్షలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కె.కొత్తవలస, మరుపల్లిలో విషాదఛాయలు

ప్రజాశక్తి- దత్తిరాజేరు

తమిళనాడులో శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కె.కొత్తవలస గ్రామానికి చెందిన మార్పిన అప్పలనాయుడు, మరడ రాము, వంగర రామకృష్ణ, గజపతినగరం మండలం మరుపల్లి గ్రామానికి చెందిన బండారు రామచంద్రరావు మృతదేహాలు సోమవారం స్వగ్రామాలకు చేరుకున్నాయి. వారికి అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో ఆ గ్రామాల్లో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. వారి భౌతికకాయాలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ, టిడిపి మండల అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, ఎంపిపి సింహాద్రి అప్పలనాయుడు, మాజీ జెడ్‌పిటిసి మంత్రి అప్పలనాయుడు తదితరులు నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



బాధిత కుటుంబాలను ఓదార్చుతున్న మంత్రి శ్రీనివాస్

పిజిఆర్‌ఎస్‌కు పోటెత్తిన వినతులు

- 273 ఫిర్యాదులు అందజేత
- అగ్రస్థానం రెవెన్యూ శాఖదే
- అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు వినతులు పోటెత్తాయి. భారీ స్థాయిలో ప్రజలు తరలివచ్చి, తమ సమస్యలపై అర్జీలను అందజేశారు. మొత్తం 273 ఫిర్యాదులు అందగా, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 120 అర్జీలు ఉండటం గమనార్హం. కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, జెసి సేధు మాధవన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను సావధానంగా విన్నారు. వినతుల్లో రెవెన్యూ శాఖకు 120, డిఆర్‌డిఎకు 45, మున్సిపల్ శాఖకు 10, పంచాయతీరాజ్ శాఖ 13, విద్యుత్ శాఖకు 10, వైద్య ఆరోగ్య శాఖకు 15 వినతులు అందాయి. వినతులపై తగు పరిష్కారం, చర్యలు చేపట్టేందుకు సంబంధిత జిల్లా అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత అధికారులు అర్జీదారును కలిసి, మాట్లాడిన తర్వాతనే ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. అర్జీదారుతో మాట్లాడిన తేదీ, సమయం కూడా వారి రిపోర్ట్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మురళి, డి.వెంకటేశ్వర రావు, రాజేశ్వరి, ప్రమీల గాంధీ, బి.శాంతి, కళావతి, సర్వే శాఖ ఎడి ఆర్.విజయకుమార్, కలెక్టరేట్ ఎఒ దేవిప్రసాద్, సిపిఒ బాలాజీ, డిఇఒ మాణిక్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

భూములిచ్చాం.. నష్టపరిహారం ఏది?

భోగాపురం మండలం రెడ్డికంచేరు గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 131/14లో 43 సెంట్లు భూమిని ప్రభుత్వం భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి తీసుకుంది. మా భూమిని స్వాధీన పరచుకొని భూమిలోకి వెళ్లకుండా ప్రహరీగోడ వేశారు. నష్టపరిహారం ఇంతవరకూ ఇప్పించలేదు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులను అడిగినా పట్టించుకోవడం లేదు. వెంటనే నష్టపరిహారం ఇప్పించాలి.

- సీరపు అప్పన్న, రెడ్డికంచేరు గ్రామం, భోగాపురం మండలం

భూమి ఖాళీ చేయాలంటున్నారు

గరివిడి మండలం వెదుళ్లవలసలో ఎస్‌సి కాలనీ వాసులు సర్వే నంబర్ 331/16, 17, 18, 19, 28లోని భూమిని 30 ఏళ్లుగా సాగుచేస్తున్నారు. గ్రామంలో కొంతమంది వచ్చి మమ్మల్ని బెదిరించి ఖాళీ చేయాలని పదేపదే ఇబ్బంది పెడుతున్నారు. వారిపై తగు చర్యలు తీసుకోవాలి.

- వై.ఈశ్వరరావు, గొడ్డు సోములు, గంటాన అప్పారావు

మరుగుదొడ్లు నిర్మించాలి

విజయనగరంలోని 19వ డివిజన్ పరిధిలో లంకాపట్నంలో మరుగుదొడ్లు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 5 వేల జనాభా ఉన్నారు. వీరందరూ రెల్లి సామాజిక తరగతి ప్రజలు. మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం వల్ల పిల్లలు, వృద్ధులకు వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. మున్సిపల్ కుళాయిలు కూడా అస్తవ్యస్తమై పోయాయి. మరుగుదొడ్లు, కొళాయిలు ఏర్పాటు చేయాలి.

- సోము మహేష్, నిమ్మకాయల రాంబాబు, బి.అప్పలనాయుడు, సూరిబాబు



సాయుధ దళాల పతాకనిధికి విరాళం అందజేస్తున్న కలెక్టర్

సాయుధ దళాల పతాక నిధికి విరాళం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఈ నెల ఏడో తేదీన జాతీయ సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి సాయుధ దళాల పతాక నిధికి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందిస్తున్న సైనికులకు, మాజీ సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు పతాక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ భద్రత కోసం నిరంతరం కృషి చేస్తున్న సైనికుల సంక్షేమార్థం అందరూ విరాళాలు అందించి, పతాక నిధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మహిళా పోలీసుస్టేషన్‌లో ఈ ఏడాది ఆగస్టు 18న నమోదైన పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష విధించినట్లు ఎస్‌పి దామోదర్ తెలిపారు. నగరంలోని గాజులరేగకు చెందిన బొండపల్లి సత్యారావు (59) తన మనవరాలు(6)పై ఇంట్లో ఎవరూ లేని సమయంలో అత్యాచారయత్నం చేశాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లి మహిళా పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి ఆర్.గోవిందరావు కేసు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నేరం రుజువు కావడంతో విజయనగరం స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు కె.నాగమణి.. సోమవారం నిందితుడికి 20 ఏళ్ల సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించడంతోపాటు బాధితురాలికి పరిహారంగా రూ.5 లక్షలు మంజూరు చేస్తూ తీర్పు వెల్లడించారని ఎస్‌పి వివరించారు.

ప్రజా ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి, పుర సేవలను మరింత విస్తృత పరచనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించారు. ఆ ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది దృష్టికి వచ్చిన ఫిర్యాదులను కూడా వెంటనే పరిష్కారం దిశగా చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన

నగరంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ పల్లి నల్లనయ్య సోమవారం పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. వీధుల్లో చెత్త తరలించే ప్రక్రియ ఏ విధంగా సాగుతుందో అడిగి తెలుసుకున్నారు. కార్మికుల హాజరు పట్టికను గమనించారు. సచివాలయాల పరిధిలో పారిశుధ్య పర్యవేక్షణ సంబంధిత కార్యదర్శులదేనని చెప్పారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలు పూడికలను వెనువెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను సందర్శించారు.

హాకీ పోటీలకు పయనమైన జిల్లా జట్టు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పులివెందులలో జరిగే అండర్-17 హాకీ పోటీలకు సోమవారం విజయనగరం జిల్లా జట్టు బయల్దేరింది. ఈ నెల 9 నుంచి 11 వరకు జరిగే పోటీల్లో జిల్లా జట్టు విజేతగా నిలవాలని స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి ఆకాంక్షించారు.


హిందీ ప్రతిభా పరీక్షకు స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

హిందీ సేవా సదన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాలో నిర్వహించిన హిందీ ప్రతిభా పరీక్షకు స్పందన లభించింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో 6 నుంచి 10 తరగతుల నుంచి సుమారు మూడు వేల మంది విద్యార్థులు హాజరైనట్లు హిందీ మంచ్ ఉత్తరాంధ్ర కార్యదర్శి కె.శ్రీధర్ తెలిపారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జనవరి 4న జిల్లాస్థాయి ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షను జిల్లా సమన్వయకర్తలు ఏలూరి శ్రీనివాసరావు, ఆసాపు చంద్రారావు, పి.ఉమాబాల పర్యవేక్షించారు.

ఎండిఎం కార్మికురాలి కుమార్తెకు ఉపాధి కల్పించాలి

విజయనగరంటౌన్ : శృంగవరపుకోటలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు విమల బ్రెయిన్ స్ట్రోక్‌తో ఇటీవల మరణించారని, ఆమె కుమార్తెకు పని కల్పించాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.సుధారాణి.. డిప్యూటీ డిఇఒ కె.వి.రమణకు వినతి అందించారు. విమలమ్మ కుటుంబానికి ఎటువంటి ఆధారమూ లేదని ఆమె కుమార్తెతో కలిసి విన్నవించారు.



పల్లవికి నగదు అందజేస్తున్న సత్య విద్యాసంస్థల ట్రెజరర్ అనూష

'సత్య' విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సత్య డిగ్రీ, పిజి కళాశాల తృతీయ సంవత్సర విద్యార్థిని ఎస్.పల్లవి ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్-2025లో వెయిట్‌లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించింది. దీంతో ఆమెను సత్య డిగ్రీ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ బొత్స ఝాన్సీలక్ష్మి, సత్య విద్యాసంస్థల ట్రెజరర్ డాక్టర్ అనూష, డైరెక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపల్ ఎంవి సాయి దేవమణి అభినందించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరెన్నో విజయాలు సాధించాలని ఝాన్సీలక్ష్మి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థికి నగదు బహుమతిని ప్రదానం చేశారు.

'సహకార' ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎపి పిఎసిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వలిరెడ్డి గిరిబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఎపి రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక డిసిసిబి (నెల్లిమర్ల బ్రాంచ్)వద్ద ధర్నా చేసి ఎజిఎం కె.రజనికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ జిఒ 36ని వెంటనే అమలు చేసి 2019,2014 సంబంధించిన పెండింగ్‌లో ఉన్న వేతనం సవరణ జరిపి మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రాట్యుటీకి సీలింగ్ విధించి 2లక్షలు మాత్రమే చెల్లిస్తున్నారని చట్ట ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ 62సంవత్సరాలకు పెంచాలని, 10లక్షలు తక్కువ కాకుండా ఉద్యోగ బీమా కల్పించి సర్వీస్‌లో మృతి చెందిన కుటుంబాలకు రూ.20లక్షలు ఉద్యోగ పాలసీ చేయించి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

చీపురుపల్లి: సహకార సంఘాలలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆ సంఘం ప్రతినిధులు బెల్లాన గోపాలం, రౌతు జగన్నాధం నాయుడులు కోరారు. ఈ మేరకు చీపురుపల్లి కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంకు వద్ద సోమవారం సిఐటియు, ఎఐబిఇఎల ఆధ్వర్యంలో సహకార సంఘాల ఉద్యోగులు నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019, 2024లలో పెండింగ్ వేతనాల విడుదల, గ్రామ సహకార సంఘ సిబ్బందికి గ్రాట్యుటీ పెంపు, ఆరోగ్య బీమా సౌకర్యం మెరుగుదల, పదోన్నతులు, ప్రమోషన్లు, డిఎల్‌ఎస్ఎఫ్ ద్వారా ఉద్యోగ భర్తీలు వంటి వాటిని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘాల ఉద్యోగులు చందక దినేష్ కుమార్, తాడేల రామునాయుడు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

గంట్యాడ : తమ సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ వ్యవసాయ సహకార ఉద్యోగుల యూనియన్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గంట్యాడ డిసిసి బ్యాంకు వద్ద సోమవారం పిఎసిఎస్ ఉద్యోగులు ధర్నా చేశారు. జిఒ నెంబర్ 36ను అమలు పరిచి 2019, 2024 సంవత్సరంలో పెండింగ్ ఉన్న వేతన సవరణలు చేసి మధ్యాంతర భృతి ఇవ్వాలని కోరారు. అనంతరం మేనేజర్ సబితకు వినతిపత్రం అందించారు.



నెల్లిమర్ల: డిసిసి బ్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

బొబ్బిలి: పిఎసిఎస్ ఉద్యోగులకు జీవో 36 ప్రకారం 2019, 2024లో పెండింగ్ వేతన సవరణ చేయాలని పిఎసిఎస్ ఉద్యోగుల యూనియన్ నాయకులు తమ్మినాయుడు, శంకరరావు, అప్పలనాయుడు డిమాండ్ చేశారు. పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక డిసిసిబి బ్యాంకు వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ చేయకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి, కారాడ, కోమటిపల్లి, చింతాడ, కలవరాయి పిఎస్‌సిఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రామభద్రపురం: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రామభద్రపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఉద్యోగులు సోమవారం డిసిసిబి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు చింతల వాసుదేవరావు మాట్లాడుతూ వేతన సవరణ, బకాయిల చెల్లింపు, ఖాళీ పోస్టుల భర్తీతోపాటు జీవో నెంబరు 36ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐలు మజ్జి రమేష్‌నాయుడు, కోట భాస్కరరావు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి- రామభద్రపురం

స్థానిక మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులు వేతన బకాయిలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని గత వారం రోజుల నుంచి చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని వీధుల్లో తిరుగుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. 4 నెలల నుంచి బకాయిలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇటీవల 3 నెలల జీతాలు ఇస్తామని పంచాయతీ అధికారి హామీ ఇచ్చి అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

బొబ్బిలి: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఆటో డ్రైవర్లకు సోమవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనాలకు బీమా, వాహన పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

జయతిలో కుష్టువ్యాధిపై సర్వే

మెంటాడ: మండలంలోని జయతి గ్రామంలో చల్లపేట ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం కుష్టువ్యాధి పై అవగాహన నిమిత్తం ఫోకల్ సర్వే చేశారు. గతంలో జరిగిన ఎల్‌సిడి క్యాంపైన్‌లో ముగ్గురికి కుష్టువ్యాధి ఉన్నట్లు గుర్తించారు. దీంతో మరోసారి గ్రామంలో ఆరు బృందాలతో ఫోకల్ సర్వేను పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. 602 ఇళ్ళలో ఇంటి ఇంటికి వెళ్లి ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు కుష్టువ్యాధి పై సర్వే చేశారు. ఈ సర్వేలో 10 మందిని కుష్టువ్యాధి అనుమానితులుగా గుర్తించారు. ఈ అనుమానితులలో ముగ్గురుకు వ్యాధి ఉన్నట్లు విజయనగరం డిపిఎంఒ దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ జి.ఉదయ్ కుమార్, లెప్రా సొసైటీ కోఆర్డినేటర్ లెంక రమణ, ఎఎన్ఎం కృష్ణవేణి, ఎంఎల్ హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, కాలువల్లో చెత్త వేయకుండా చూడాలి

బొబ్బిలి: మున్సిపాలిటీలోని రోడ్లు, కాలువలలో చెత్త వేయకుండా చూడాలని శానిటరీ సిబ్బందిని కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. స్థానిక రైల్వే జంక్షన్, ఫైర్ స్టేషన్ ప్రాంతాలలో సోమవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయలక్ష్మి మెస్ ముందు నుంచి ఉన్న కాలువపై పలకలు తొలగించి పూడికలు తీయాలన్నారు. స్టేషన్ కార్యాలయం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో మొక్కలు నాటాలన్నారు. రోడ్లు, కాలువలలో చెత్త వేయకుండా చూడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీను ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక సాయం

భోగాపురం: భోగాపురం, పూసపాటిరేగ తీరప్రాంత గ్రామాలైన కొండరాజుపాలెం, తిప్పలవలస గ్రామాలకు చెందిన మత్స్యకార కుటుంబాలకు ఎమ్మెల్యే లోకం నాగమాధవి సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. వేటకు వెళ్లి బంగ్లాదేశ్ చెరలో చిక్కుకున్న తొమ్మిది మంది మత్స్యకారులు క్షేమంగా ఉన్నారని వారి కుటుంబాలకు జీవనోపాధి నిమిత్తం హేచరీ యజమానుల ద్వారా ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేలు, 25 కేజీల బియ్యం అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. మత్స్యకారులు క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడుతున్నామని ఎవరు అధైర్య పడవద్దు అని ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గూడెపువలస, కొవ్వాడ సర్పంచ్‌లు మట్ట అయ్యప్ప రెడ్డి, కోట్ల రఘు, ఎఎంసి ఉపాధ్యక్షులు బి.దుర్గ, జనసేన నాయకులు పల్లంట్ల జగదీశ్వరరావు, వందనాలరమణ, పల్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక అక్షరాస్యత అవసరం

దెంకాడ: మహిళలకు ఆర్థిక అక్షరాస్యత అవసరమని ఎఒ టి.సంగీత, ఎస్‌బిఐ ఫైనాన్సియల్ లిటరసీ కోఆర్టినేటర్ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఎంఎస్ కార్యాలయంలో సోమవారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమైక్య అధ్యక్షులు తుమ్మురోతు లలిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు ముఖ్య ప్రాజెక్టు పనులు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై చర్చించి అవసరమైన తీర్మానాలను ఆమోదించారు. గ్రామ సంఘాల భవన నిర్మాణానికి అవసరమైన స్థల కేటాయింపునకు తహశీల్దార్‌కు సమాఖ్య తరపున విన్నపం సమర్పించారు. ఈ సమావేశంలో ఇసి సభ్యులు, మండల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

దెంకాడలో ఉచిత గ్యాస్ పంపిణీ

దెంకాడ: మండల కేంద్రంలో నెల్లిమర్ల గాయత్రి ఏజెన్సీ గ్యాస్ డీలర్ బూర్లె శ్రీధర్ సహకారంతో సఖీ గ్యాస్ పాయింట్ వద్ద 31 ఉజ్వల ఉచిత గ్యాస్ కనెక్షన్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పతివాడ గౌరి, కూటమి నాయకులు పాణి, ప్రదీప్, సిరిక అప్పారావు, సిరికి మహేష్, కర్రి కృష్ణ, కిలపర్తి శంకర్, సఖి గ్యాస్ పాయింట్ నిర్వాహకులు కర్రి చిన్నారి పాల్గొన్నారు.



గ్యాస్ పంపిణీ చేస్తున్న నాయకులు

వృద్ధుని సమస్య పరిష్కారం

దెంకాడ: మండలంలోని గంట్లాం గ్రామానికి చెందిన బుత్తల అప్పన్న పేరిట గత వైసిపి ప్రభుత్వంలో 110 ఎకరాలు భూములున్నట్లు ఆన్‌లైన్‌లో చూపించింది. దీంతో ఆయనకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పథకాలు ఏవీ రాలేదు. దీంతో ఆయన ఆర్థికంగా ఇబ్బంది పడుతూ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఆ సమస్యను పరిష్కరించి ఆయన పేరిట ఉన్న భూమిని రద్దు చేసి ఆయనకు యధావిధిగా ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం ఆయనకు జనసేన నాయకులు ఇంటికి వెళ్లి రేషన్ సరుకులు అందించారు.

పంచాయతీల విభజనపై వినతి

దెంకాడ: మండలంలోని పెద్దతాడివాడ పంచాయతీ పరిధిలోని ఊడికలపేట, చింతవలస-2 పంచాయతీలను విభజించాలని ఆయా గ్రామాలకు చెందిన టిడిపి జిల్లా మహిళా ఉపాధ్యక్షులు, మాజీ ఎంపిటిసి చిల్లా పద్మా, ఎడ్యుకేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రాష్ట్ర డైరెక్టర్ సిహెచ్ సుహాసిని, గంగాదర్, రమేష్ యాదవ్, ఎన్.సాయికుమార్ సోమవారం ఎంపిడిఒ వై.భవానీకి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దతాడివాడ నుంచి ఊడికలపేట, బేతనాపల్లిని వేరు చేసి రెండు వేర్వేరు పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని, అలాగే చింతవలస-2ను కూడా ఒక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు.

టీచ్ టూల్ రీఫ్రెష్ ట్రైనింగ్

తెర్లాం: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో స్టాల్ ప్రోగ్రాం అమల్లో భాగంగా టీచ్ టూల్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రెండు రోజులు పాటు ఎంపిక చేసిన కొంతమంది హైస్కూల్ హెచ్ ఎంలు, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్ఎంలు ఇతర ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించడం, పిల్లల అభ్యసన స్థాయిలు ఏ విధంగా ఉన్నాయో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పరిశీలించాలని ఎంఇఒ త్రినాధరావు సూచించారు. కోర్సు డైరెక్టర్‌గా పాపారావు, ట్రైనీలుగా పి.శ్రీదేవి, బి.అప్పన్న వ్యవహరించారు.



శిక్షణను పర్యవేక్షిస్తున్న ఎంఇఒ త్రినాథరావు

లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కారం

శృంగవరపుకోట: లోక్ అదాలత్ ద్వారా కేసులను సత్వరం పరిష్కరించుకోవచ్చునని ఎస్‌కోట సివిల్ జడ్జి బి. కనకలక్ష్మి అన్నారు. ఈ నెల 13వ తారీఖున జరగబోవు జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ఆమె న్యాయవాదులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌కు ఎక్కువ వ్యాజ్యాలను పంపించడం ద్వారా అధిక సంఖ్యలో రాజీ పరిష్కారం చేయడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవాదులు కక్షిదారులను సమన్వయం చేయడం వల్ల అధిక సంఖ్యలో కేసులు రాజీ ద్వారా పరిష్కారమయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. సివిల్ కేసులలో రాజీ అవడం ద్వారా వాది చెల్లించిన కోర్టు ఫీజును తిరిగి వాపస్ ఇస్తారన్నారు. సమావేశంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

ఫిల్టర్ నీరు తాగే మీకు
కొళాయి నీటిపై ఫిర్యాదులు ఎందుకు?

- హెచ్చరించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్
- ఆందోళనకు సిద్ధమవుతున్న కాలనీవాసులు

ప్రజాశక్తి - చీపురుపల్లి

'ఫిల్టర్ నీరు తాగే మీరు కొళాయి ద్వారా సరఫరా అయ్యే మురుగు నీటిపై ఫిర్యాదులు ఎందుకు చేస్తున్నారు'.? అంటూ చీపురుపల్లి పంచాయతీ పరిధిలోని సచివాలయం-3లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ అరవింద్ సోమవారం ఫిర్యాదుదారుల పట్ల వ్యంగంగా మాట్లాడుతూ భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో కాలనీవాసులు సదరు ఇంజనీరింగ్ అసిస్టెంట్ పనితీరుపైన ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధపడుతున్నారు. సోమవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.

చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో యధావిధిగా సోమవారం రామాంజనేయ కాలనీ, అంబేద్కర్ కాలనీ తదితర ప్రాంతాలకు తాగునీటి సరఫరాను చేశారు. ఈ క్రమంలో కొళాయి పైపులు ద్వారా సుమారు నాలుగు ఐదు బకెట్ల వరకు మురుగునీరు సరఫరా కావడంతో పాటు దుర్గంధం వెదజల్లడంతో స్థానికులు కొళాయిల ద్వారా వస్తున్న నీటిని ఫోటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. దీనిపై స్పందించిన ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి రామకృష్ణ తన బృందంతో రామాంజనేయ కాలనీలో పర్యటించి కొళాయిల ద్వారా వస్తున్న నీటిని పరిశీలించారు. అనంతరం కొంత నీటిని సేకరించారు. ఈ క్రమంలో తనతో పాటు అరవింద్ అనే ఇంజనీరింగ్ ఉద్యోగి విచారణలో పాల్గొని ఫిర్యాదుదారులను భయపెడుతూ మాట్లాడడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మీరు ఏ నీరు తాగుతున్నారు? ఫిల్టర్ నీరు తాగే మీకు కొళాయి నీటిపై ఫిర్యాదు చేయాల్సిన అవసరం ఏంటి? మీ ఫిల్టర్ నీరు తీసుకురండి పరీక్షలు చేస్తాం. మినరల్స్ ఎందులో ఎక్కువ ఉన్నాయో చూపిస్తాం. అంటూ ఫిర్యాదుదారులను బెంబేలెత్తించే విధంగా సదరు ఉద్యోగి మాట్లాడం పట్ల స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మీ ఇంట్లో ఎవరెవరు ఏ ఉద్యోగాలు చేస్తున్నారు. వారి వివరాలు చెప్పండి అంటూ ఫిర్యాదుదారును బెదిరిస్తూ సదరు ఇంజనీరింగ్ అసిస్టెంట్ హుకుం చేయడం పట్ల ఆయన పనితీరును దుయ్యబడుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించి ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామకృష్ణ స్థానికంగా నీటి నిల్వలను సేకరించి రెండు రోజుల్లో ఎటువంటి సమస్య లేకుండా పరిష్కరిస్తామని స్థానికులకు హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది. ఇదిలా ఉండగా ఫిర్యాదుదారుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ పైన చర్యలు తీసుకోవాలంటూ కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సంఘటన పైన స్థానిక ఎంపిడిఒ సురేష్‌ను వివరణ కోరగా.. సదరు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పైన చర్యలు తీసుకుంటామని, తాగు నీటలో కలుషితం జరగకుండా చర్యలు చేపడతామని అన్నారు.



కొళాయిల ద్వారా వచ్చిన బురద నీరు

పేదలకు సంజీవని సిఎం సహాయనిధి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- రాజాం

పేద ప్రజలకు సంజీవనిగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం 16 మంది లబ్ధిదారులకు రూ.7.23లక్షల సిఎం సహాయనిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ఆసుపత్రిలో ఎన్‌టిఆర్ వైద్య సేవలో లబ్ధిపొందని పేద వారికి ముఖ్యమంత్రి సహాయనిధి భరోసాగా నిలుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజారోగ్య సంక్షేమం కోసం కట్టుబడి ఉందని అన్నారు. పేదలకు ఎటువంటి అనారోగ్యం వచ్చినా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే సిఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నంది సూర్య ప్రకాశరావు, గురవాణ నారాయణ రావు, కిమిడి అశోక్ కుమార్, దూబ ధర్మారావు, దుప్పల పూడి శ్రీను, టి కన్నం నాయుడు, శాసపు రమేష్ కుమార్, బవిరి శ్రీనుబాబు, గుణపు జయమ్మ, మాడుగుల జయరాం, చిట్టి, మరిపి జగన్ మోహన్ రావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి- రాజాం

మండలం కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో సోమవారం అడిషనల్ సిడిపిఒ సన్యాసమ్మ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నిర్మూ లించే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. బాల్య వివాహాల పిల్లల జీవితా లను నాశనం చేస్తాయనే అవగాహన తల్లిదండ్రులకు సిబ్బంది శిక్షణ ఇవ్వాల న్నారు. బాల్యవివాహాలు జరిపించినా ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు జరిపిస్తే జరిగే అనర్థాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల లెవెల్ సిఎంపిఒ, సూపర్‌వైజర్ బంగారమ్మ, ప్రసన్న, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల బాల్య వివాహ నిర్మూలన ప్రచార కార్యక్రమాన్ని సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఐసిడిఎస్ సిడిపిఒ లావణ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ప్రచారం గత నవంబరు 27 నుంచి ఈ నెల 8 వరకూ మూడు విడతల్లో కొనసాగనుందని తెలిపారు. మొదటి విడతలో మండల ంలోని అన్ని స్కూల్స్, కాలేజీల్లో అవగా హన సదస్సులు, రెండో విడతలో వివాహ సంబంధ కార్యక్రమాలు నిర్వహించే కమ్యూనిటీ సభ్యులు, పెద్దలు, పురోహి తులకు, మూడో విడతలో ప్రతి గ్రామంలో గ్రామసభలు ఏర్పాటు చేసి బాల్యవివాహ నిర్మూలనపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ సమావేశంలో డిపిఒ లావణ్య, ఎన్‌జిఒ ప్రతినిధి శివశంకర్, ఎంఇఒ రమణ మూర్తి, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

స్థలం కేటాయించండి

శృంగవరపుకోట: పట్టణంలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని తహశీల్దార్ డి. శ్రీనివాసరావుకు పలువురు వినతినిచ్చారు. పాఠశాల చైర్మన్ కె.లక్ష్మి, హెచ్ఎం కెఆర్‌కె పట్నాయక్, హాస్టల్ వార్డెన్ పి.లక్ష్మణరావు, టీచర్ మురళీధర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా మేనేజ్మెంట్ కమిటీ నెంబర్ డి.సూర్యారావు మాట్లాడుతూ ఈ గిరిజన ఆశ్రమ పాఠశాల 40 ఏళ్ల క్రితం 100 మంది విద్యార్థులకు సరిపడా నిర్మించారని నేడు విద్యార్థులు 211 మంది ఈ భవనంలో నివాసం ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్నారని చెప్పారు. భవనం శిథిలావస్థకు చేరిందని విద్యార్థులు ఆడుకోవటానికి క్రీడా మైదానం లేదని సరిపడా గదులు లేవని ఈ కారణాలన్నింటినీ దృష్టిలో పెట్టుకొని 5ఎకరాల భూమిని ఈ హాస్టల్ భవనానికి కేటాయించాలని కోరారు.

ఎపిఎన్‌జిఒ ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి - చీపురుపల్లి

ఎపి ఎన్‌జిఒ చీపురుపల్లి తాలూకా యూనిట్ ఎన్నికలు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏకగ్రీవమయ్యాయి. ఈ ఎన్నికలలో ఎల్ అప్పలనాయుడుని నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షునిగా కె.జగదీశ్వరి, ఉపాధ్యక్షులుగా కె.లక్ష్మణరావు, పి.రవికుమార్, కెవిఎస్ కిషోర్ కుమార్, ఎల్.వేణుగోపాల్, వై.ఝాన్సీరాణి, కార్యదర్శిగా ఎం.అప్పలస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జె.మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీలుగా సాయి అభిరామ్, బి.రాంబాబు, కె.గోపాలకృష్ణ, ఎస్.హైదర్ అలీ, ఈ చంద్రకుమారి, కోశాధికారిగా ఎస్ రామారావువులు ఎన్నికయ్యారు. వీరితోపాటు సభ్యులుగా మరి కొంతమంది సభ్యులను ఎన్నుకున్నారు. కాగా ఎన్నికల పరిశీలకులుగా కెబి శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం పార్వతీపురం జిల్లాలో నుండి ఎపి ఎన్‌జిఒ సంఘ జిల్లా నాయకులు పాల్గొన్నారు. అనంతరం చీపురుపల్లిలో ఎపిఎన్‌జిఒ సంఘ సభ్యులతో సహ ఉద్యోగులు భారీ ర్యాలీ చేపట్టారు.



తెర్లాం: ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

తెర్లాం: తెర్లాం తాలూకా యూనిట్ ఎపి ఎన్‌జిఒ అధ్యక్షుడిగా ఎన్ నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఒకే సెట్ నామినేషన్ వేయడంతో ఎన్నికల అధికారి జి.సూర్యనారాయణ, సహాయ ఎన్నికల అధికారి అప్పారావు ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా నాగేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.వినయ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా సిహెచ్ జోగినాయుడు, కార్యదర్శిగా కె.ప్రసాద్ రావు, కోశాధికారిగా టి. అరుణ, సూర్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రీన్ అంబాసిడర్లకు హెల్త్ అలవెన్స్ ఇప్పించాలి

ప్రజాశక్తి- మెంటాడ

గ్రీన్ అంబాసిడర్లకు ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ అలవెన్సులు రూ.4వేలు ప్రతి నెలా తక్షణమే అమలు చేయాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిడిఒ సుదర్శన్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ అంబాసిడర్లకు ప్రభుత్వం ఇస్తున్న జీతం కుటుంబ జీవనోపాధికి చాలడం లేదని పెరుగుతున్న నిత్యావసరాల సరుకులు కొనేందుకు కూడా అవస్థలు పడుతన్నారని చెప్రా. ప్రతి రోజు తడి పొడి చెత్త సేకరణ, కాలువల పూడికతీత వల్ల అనారోగ్య బారిన పడుతున్నారని, ఇతర వ్యాధులు వచ్చే ఆస్కారం ఉందని, అప్పులు చేసి వైద్యం పొందుతున్నారని ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ అలవెన్స్ ఈ నెల నుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల అంబాసిడర్లు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి - వేపాడ

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, రైతులు పండించే ప్రతి గింజకూ గిట్టుబాటు ధర లభించేలా కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. మండలంలోని కేజీపూడిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర హామీ, పంటకు సరైన మద్దతు ధర అందించడం కోసం ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రైతు నుంచి ధాన్యం విక్రయించిన 48 గంటల్లోపే చెల్లింపు నేరుగా రైతు బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందని స్పష్టం చేశారు. దళారుల జోక్యం లేకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోలు జరుగుతుందని, దీంతో రైతులకు పూర్తి లాభం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒ స్వాతి, టిడిపి ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, మాజీ సర్పంచ్ గోలగాని కృష్ణమూర్తి, చల్లా వెంకటరావు, జగదీశ్ పరవాడ, బూత్ ఇంచార్జ్ మమ్ములూరి సూర్యనారాయణ, సింహాద్రి, సత్తిబాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు రొంగలి పోలినాయుడు, రైతులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

గ్రీవెన్స్ ఫిర్యాదులు వెంట వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే లోకం నాగ మాదవి అన్నారు. సోమవారం ఆమె స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని రెవెన్యూ పరిధిలో ఉన్న భూ సమస్యలపై తహశీల్దార్ ఎన్‌వి రమణతో చర్చించారు. చిన్న బత్తివలస పంచాయతీ కార్యాలయం, బిఎస్‌ఎన్‌ఎల్ టవర్ నిర్మాణానికి సంబంధించిన స్థల సమస్యపై అడిగారు. పసుపాంలో తారు రోడ్డు నిర్మాణానికి అడ్డుపడుతున్న వారి వివరాలు, సమస్య పరిష్కరించాలని కోరారు. పూసపాటిరేగలో రైతు బజార్‌కు సంబంధించి స్థల సేకరణ చేయాలని చెప్పారు. కోనాడలో భూ సమస్యపై స్పందించాలన్నారు. కోర్టులో ఉందని రెవెన్యూ అధికారులు సమాధానం చెప్పడంతో స్టేలు తెచ్చుకుంటే వదిలేయడమేనా అంటూ ఆమె ప్రశ్నించారు. చోడమ అగ్రహారంలో వరుణ్ మోటార్స్‌కు చెందిన ప్రహరీలో 5ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమణ జరిగిందని ఆమెకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఇళ్ల స్థలాలకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు అన్న విషయాలు అడిగి తెలుసుకున్నారు.

స్క్రబ్ టైఫస్ నిర్మూలనపై దృష్టి

ప్రజాశక్తి - సంతకవిటి

స్క్రబ్ టైఫస్ వ్యాధి ప్రమాదాలను ప్రజలకు తెలియజేయడం అత్యవసరమని ఎంపిడిఒ కె.సురేష్‌కుమార్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు ఆయన సూచనలు చేశారు. సంతకవిటి, మండవకురిటి పిహెచ్‌సిల వైద్యులు డాక్టర్ నాగేంద్ర ప్రసాద్, డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ ఈ వ్యాధిలో తలనొప్పి, జ్వరం, శరీర నొప్పులు, దురద వంటి లక్షణాలు కనిపిస్తాయని వెల్లడించారు. ఈ వ్యాధి అంటురోగం కాదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎఒ సిబి యస్వంత్ రావు, సిహెచ్ఒ రాజారత్నం, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని ఆంధ్ర జెడ్‌పి హైస్కూల్లో టెన్త్ విద్యార్థి కిలారి రామ్ చరణ్ సోమవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఉదయం ప్రత్యేక తరగతి నిమిత్తం హైస్కూల్‌కు వచ్చిన విద్యార్థి, క్లాసులు ప్రారంభానికి సమయం ఉండడంతో కొత్తగా నిర్మిస్తున్న పాఠశాల భవనం పై భాగానికి వెళ్ళాడు. పాఠశాల పైనుంచి కొద్దిసేపటికే కిందకు పడిపోయాడు. శబ్దం విని అక్కడే ఉన్న విద్యార్థులు పరిగెత్తి వెళ్లి పడివున్న విద్యార్థిని చూసి భయంతో కేకలు వేశారు. దీంతో గ్రామస్తులు అక్కడకు చేరుకుని గాయపడిన విద్యార్థి రామ్‌చరణ్‌ను ఉపాధ్యాయుల సహకారంతో హుటాహుటిన గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శరీరం పై గాయాలు బట్టి విద్యుత్ ఘాతానికి గురైనట్లు వైద్యులు స్పష్టం చేశారని కుటుంబ సభ్యులు చెప్పారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

పాఠశాల భవనం నుంచి వెళ్తున్న విద్యుత్ వైర్లు తొలగించాలని ఉపాధ్యాయులు విద్యుత్ శాఖ అధికారులను లిఖితపూర్వకంగా కోరారని, తమ ఫిర్యాదు పట్టించుకోకపోవడం వల్లనే ప్రమాదం సంభవించిందని ఎంఇఒ మోహనరావు, హై స్కూల్ ఉపాధ్యాయులు ఆరోపించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

వేపాడ: మండలంలో పలు సమస్యలను పరిష్కరించాలని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు సోమవారం అమరావతిలో ప్రజా సమస్య పరిష్కార వేదికలో సిఎం చంద్రబాబుకు వినతి పత్రాన్ని అందించారు. మండలంలోని బక్కునాయుడుపేట బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో కళావేదిక, పేరెంట్స్ వెయిటింగ్ హాలు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, అనుమతులు లేకుండా తీసిన తొమ్మిది తాగునీటి బోరుబావులు నిధులు నిలుపుదలుచేయాలని, గ్రామీణ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. విశాఖపట్నం నుండి వేపాడకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. స్పందించిన అధికారులు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు అప్పారావు తెలిపారు.

ఆటోను ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి- రాజాం

పాలకొండ ప్రధాన రహదారిలో సోమవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా ప్యాసింజర్ ఆటో రోడ్డు మీదకు రావడంతో ఆర్‌టిసి బస్సు ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటో బోల్తా పడింది. ఆ సమయంలో ఆటోలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ ఉన్న స్థానికులు స్పందించి ఆటోను పైకి లేపడంలో సహాయం చేశారు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.